

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

వేల గొంతులు-లక్ష డప్పులు కార్యక్రమంతో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని నంది అవార్డు గ్రహీత సురేందర్ అన్నారు. -8లో▸



పేదలకు అండగా ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. -8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30⁰/16⁰


జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి పొగమంచు కురవడంతో చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సలహాలు, సూచనలు స్వీకరించేందుకు సోమవారం(నేడు) 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల ప్రయాణికులు 9959226047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

త్రివర్ణ వెలుగుల్లో వేంకటేశుడు



చిల్పూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం బుగులు వేంకటేశ్వర స్వామి త్రివర్ణ వెలుగుల్లో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ త్రివర్ణ వేంకటేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ మోహన్, వీరన్న, మల్లికార్జున్, ధర్మకర్తలు రమేశ్, బుచ్చయ్య, రత్నాకర్‌రెడ్డి, వెంకటరమణాదేవి, రాజశేఖర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో టెండర్లకు ఆహ్వానం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 28 నిర్వహించాల్సిన 10 రకాల టెండర్లను అనివార్య కారణావల్ల వాయిదా వేసి తిరిగి ఈనెల 31న శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఆలయంలో లైటింగ్ డెకరేషన్ సౌండ్ సిస్టం, రంగులు, సున్నలు వేయుట, కరెంటు సామగ్రి, ప్లంబింగ్ సామగ్రి, నిత్యం పూలదండలు, దేవస్థానానికి కూరగాయలున, పాలు, పెరుగు, స్టేషనరీ సప్లయ్ చేయుట, ఫొటోగ్రఫీ, వీడియో, ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటుకు సీల్డ్ టెండర్లు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

వల్మిడిలో..

వల్మిడి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో 2025-2026 సంవత్సరానికి కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములు, లడ్డు, పూలిహోర అమ్ముకొనుట, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈనెల 31న శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు తెలిపారు. సీల్డ్ టెండర్లలో పాల్గొనేవారు ఈనెల 30 గురువారం సాయంత్రం వరకు ఆయా దేవస్థాన కార్యాలయాల్లో స్వామి వారి పేర్లుతో రూ.1,000 చెల్లించి షెడ్యూల్ పొందాలని ఈఓ తెలిపారు.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ




రఘునాథపల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ఇది నిరంతర ప్రక్రియ అని ఉమ్మడి వరంగల్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కన్నాయపల్లి గ్రామంలో ఆదివారం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అమలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రేషన్‌కార్డులకు సంబంధించి మంజూరు పత్రాలు అందజేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారడోజు రాంబాబు, తహసీల్దార్ మోసిన్, మండల ప్రత్యేకాధికారి రాజేందర్, ఏఓ శ్రీనివాస్, డీటీ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాల మంజూరు పత్రాలు

బచ్చన్నపేట: లబ్ధిదారులకు పథకాల మంజూరు పత్రాలను అందిస్తున్నామని, ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు పథకాల మంజూరి పత్రాలను అందించారు. తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ మల్లికార్జున్, ఏఓ విద్యాకర్‌రెడ్డి, ఎస్సై హమీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నాయకులు విద్యానాథ్, వెంకటాచారి, రవీందర్‌రెడ్డి, హరిబాబు, రాములు, హరీశ్, సందీప్, బాల్‌రాజు పలువురు పాల్గొన్నారు.

ప్రమాద ఊహాచిత్రం




బోల్తా పడిన భారీ ట్రేలర్ ట్రక్


ఆటో కింద ఇరుక్కుపోయిన ఆటో డ్రైవర్ రాపర్తి సాగర్

నలిగిన వలస బతుకులు

పొట్టకూటి కోసం వస్తే నలుగురి ప్రాణం పోయింది

- ఐదు రోజులక్రితమే మామునూరుకు వచ్చిన కుటుంబం
- వ్యవసాయ పనిముట్లు చేస్తూ జీవనోపాధి
- ట్రేలర్ ట్రక్ రూపంలో కబళించిన మృత్యువు
- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..

పొట్టకూటి కోసం ఐదు రోజులక్రితమే రాష్ట్రం విడిచి వచ్చారు. దేరాలు వేసుకుని ఇనుప పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరో ఊరిలో వీటికి గిరాకీ బాగుందని తెలుసుకున్న ఆ కుటుంబం ఆటోలో వెళ్తుండగా బయల్దేరిన పది నిమిషాల్లో18 టైర్లతో కూడిన ట్రేలర్ ట్రక్ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విగతజీవులయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీభ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్‌చౌహాన్ (45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్ (18), కుమారుడు ఖన్నా చౌహాన్ (7)గా గుర్తించారు. సంతోశ్ భార్య చామాబాయి, కుమారుడు ముఖేశ్ చౌహాన్‌తో పాటు ఆటోడ్రైవర్లు ఎండీ షకీర్, రాపర్తి సాగర్, చిర్ర రాజుకు గాయాలయ్యాయి.

– సాక్షి, వరంగల్ – పూర్తి వివరాలు 8లో▸


రోడ్డు పక్కన పడిపోయిన ఆటో, ఐరన్ రాడ్లు


మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

అర్హులకే పథకాలు

- నాలుగు పథకాల అమలు నిరంతర ప్రక్రియ
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- ధర్మకంచ మినీ స్టేడియంలో గణతంత్ర వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


ప్రసంగిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రం లోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం మాట్లాడారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అర్హులైన నిరుపేదలను గుర్తించేందుకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి జిల్లా, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. పథకాల ప్రారంభోత్సవం పురస్కరించుకుని మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని అర్హులైన వారికి మంజూరు పత్రాలను అందించడం జరిగిందన్నారు. అర్హులైన లబ్ధిదారులు పథకానికి ఎంపిక కాలేదనే బెంగ వద్దని, ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తూ, సంక్షేమ ఫలాలను అందించేందుకు జిల్లాలోని ఆయా శాఖల అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో సంక్షేమం..

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ (మహాలక్ష్మి స్కీం)లో అమలు చేస్తున్న ఉచిత ప్రయాణం రికార్డు సృష్టించిందన్నారు. ఇప్పటి వరకు 1,47,31,489 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేయగా, రూ.70,21,44,000 లబ్ధిచేకూరిందన్నారు. గృహజ్యోతి స్కీంలో 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ద్వారా 87వేల కుటుంబాలకు 4,69,000 జీరో బిల్లులు జారీ చేయగా, రూ.13.47కోట్ల సబ్సిడీ పొందినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు 3,500 చొప్పున 11,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. విడుతల వారీగా లబ్ధిదారులకు రూ.5లక్షల నగదు అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన క్రమంలో జిల్లాలో 8,229 మంది పేదలకు వైద్య సేవలు అందించామన్నారు. 54,301 మంది రైతులకు రూ.472కోట్ల పంట రుణమాఫీ జరిగిందన్నారు. ఉద్యానవనం, సూక్ష్మ సేద్యం పథకం ద్వారా ఆయిల్‌పామ్, ఇతర పంటలకు మొక్కలు, పరికరాలు, డ్రిప్, తుంపర సేద్యానికి రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతిలో ఈసారి జిల్లా.. రాష్ట్రంలో టాప్‌లో ఉండాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లేదుకు విజయోస్తు ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టామన్నారు. పేదరిక నిర్మూలన(సెర్ప్) ద్వారా లక్ష27వేల485 గ్రామీణ మహిళలతో 11వేల229 స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో జనగామ జిల్లాను ముందు వరుసలో ఉంచామన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా 9,278 సంఘాలకు రూ.476 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, 4,184సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు రూ.386 కోట్ల రుణాలు మంజూరీ చేసినట్లు స్పష్టం చేశారు. గణతంత్ర వేడుకల్లో 574 సంఘాలకు రూ.64.9కోట్ల చెక్కులను అందించామన్నారు. స్త్రీనిధి ద్వారా 248 స్వయం సహాయక సంఘాలకు రూ.6.30కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. రూ.190 కోట్లతో జనగామ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పనితీరు బాగుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్, ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్, కలెక్టరేట్ ఏఓ మన్సూరీ, డీఆర్డీఓ వసంత, ఉన్నతాధికారులు రామారావు, రమేశ్, వసంత తదితరులు పాల్గొన్నారు.


ధర్మకంచ మినీ స్టేడియంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన డీసీపీ, అదనపు కలెక్టర్లు, ఏఎస్పీ


స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్, అధికారులు


పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ధర్మకంచ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ మెరీస్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. దేశ సంస్కృతి, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ విద్యార్థులు చేసిన ప్రదర్శన ప్రతి మనసును కదిలించింది. సలీం పాషా ఆధ్వర్యంలో యువతీ, యువకులు మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన చేశారు.


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అవార్డుల వాయిదా

ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, తదితరులకు అవార్డులను అందించేవారు. కానీ, ప్రభుత్వం చేపట్టిన పథకాల అమలు ప్రారంభోత్సవం, జిల్లాకు మంత్రి రాక నేపథ్యంలో ఈసారి అవార్డుల కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఒకటి, రెండు రోజుల్లో అవార్డులను ఇస్తారా.. లేక వచ్చే ఏడాదికి పొడగిస్తారా.. అనేది తెలియాల్సి ఉంది. కాగా, వచ్చే నెలలో పదవీ విరమణ పొందే ఉత్తమ ఉద్యోగులు, సిబ్బందికి మాత్రం నిరాశే మిగిలింది.

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు


జనగామ: కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, అధికారులు

జనగామ: జనగామ సమీకృత కలెక్టరేట్ సముదాయంలో ఆదివారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి మన్సూరీ వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జిల్లా కోర్టులో..

జనగామ రూరల్: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కోర్టులో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డీ.రవీంద్ర శర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ విలువలకు ప్రతి ఒక్కరు కట్టుబడి పనిచేయాలని అన్నారు. ఈసందర్భంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ కుమార్ కే సందీప, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట్రాం నర్సయ్య, జనగామ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలగందుల చంద్రఋషి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

పురపాలిక స్పెషల్ ఆఫీసర్‌గా పింకేశ్ కుమార్



జనగామ: జనగామ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ నెల 26తో పురపాలిక పాలక మండలి పదవీ కాలం ముగియడంతో ఎన్నికలు నిర్వహించే వరకు స్పెషల్ ఆఫీసర్లకు పరిపాలనా బాధ్యతలను అప్పగించారు. ప్రత్యేక అధికారి హయాంలోనైనా పురపాలిక పాలన గాడిలో పడుతుందా.. లేదా.. వేచి చూడాలి.

జనం చూస్తున్నారు.. బుద్ధి చెప్తారు

- సిగ్గుంటే అర్హులందరికీ పథకాలు ఇవ్వండి
- సీఐపై డీజీపీకి ఫిర్యాదు చేస్తా..
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

జనగామ: జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్తారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎర్రగుంట తండా శివారుతోపాటు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రగుంట తండాకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా బీఆర్‌ఎస్ నాయకులను బలవంతంగా అరెస్ట్ చేశారన్నారు. తండా ప్రజల తరఫున సమస్యలను మంత్రికి వినిపించడంతోపాటు పార్టీ నాయకులను విడుదల చేయాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. పోలీసులు విచక్షణ రహితంగా చేసిన లాఠీచార్జీలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన మాజీ సర్పంచ్‌తో సహా 8మంది సభ్యులు, పలువురు నాయకులకు తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. లా అండ్ ఆర్డర్ సమస్య ఉందనే కారణంతో మంత్రి తన ప్రోగ్రాంను రద్దు చేసుకుని ఇక్కడకు రాకుండా వెళ్లిపోయారన్నారు. పోలీసుల అండతో కాంగ్రెస్ శ్రేణులు బయట నుంచి వ్యక్తులను తీసుకొచ్చి తమ పార్టీకి చెందిన నాయకులను చితకబాధడంతో తలలు పగిలి, వేళ్లు విరిగాయన్నారు. పోలీస్ వ్యవస్థ ఇంత దుర్మార్గంగా ఎప్పుడూ ప్రవర్తించలేదన్నారు. తనను అరెస్ట్ చేసే సమయంలో ఓ సీఐ పాటలు పెట్టించి, కాంగ్రెస్ వాళ్లతోనే డాన్స్‌లు చేయించాడన్నారు. అదే సీఐ తమ నాయకులపై ఇష్టం వచ్చినట్లు లాఠీచార్జీ చేశాడని, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నియోజక వర్గంలో అత్యంత చిన్న గ్రామంలో కారక్రమం పెట్టి, ఇంతమంది బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేశారన్నారు. సిగ్గుంటే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. తలలు పగులగొట్టినా అక్రమాలపై పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట లాఠీచార్జీలో గాయపడ్డ నాయకులు, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ పథకాలు బండి సంజయ్ అయ్య జాగీరా..

- ప్రభుత్వ ఇళ్లకు ఇందిరమ్మ పేరుపెడితే నష్టమేంటి..?
- ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇళ్లకు ఇందరిమ్మ పేరుపెడితే ఇవ్వమని కేంద్రమంత్రి బండి సంజయ్ అనడం హాస్యాస్పదంగా ఉంది.. ఇందిరమ్మ పేరు పెడితే నష్టమేమిటీ..? బండి సంజయ్ అయ్య జాగీరా అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు దావోస్ వెళ్లి రూ.1.78 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువస్తే హర్షించాల్సింది పోయి కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. 'కేంద్ర ప్రభుత్వం అనేది ఒక ఫెడరల్ సెటప్.. అన్ని రాష్ట్రాలు కలిస్తేనే కేంద్రం.. తెలంగాణ ప్రజలు కట్టే టాక్స్‌ల్లో 50శాతం మాకు చెల్లించండి.. మీది ఒక్క పైసా అవసరం లేదు' అని అన్నారు. తెలంగాణపై ప్రేమ ఉంటే ప్రధాని మోదీని ఒప్పించి అదనంగా రూ.10వేల కోట్ల నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ ప్రకటించడం అభినందనీయమని, ఈ అవార్డు మాదిగలు, మాదిగ ఉపకులాల కు దక్కిన గౌరవంగా ఎమ్మెల్యే కడియం పేర్కొన్నారు.


కొత్తపల్లిలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న కడియం

అర్హులకు పథకాలను అందించడమే లక్ష్యం

రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తానేదార్‌పల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీపీఓ స్వరూపరాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒకే రోజు నాలుగు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను రాష్ట వ్యాప్తంగా చేపట్టడం చారిత్రాత్మకమన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

లింగాలఘణపురం: అర్హులైన ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లిలో నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు వెళ్లి కోట్ల రూపాయల పెట్టుబడులు తెస్తే ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. అధికారుల తీరుపై ఎమ్మెల్యే కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్, డీపీఓ స్వరూపరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుడోజు రాంబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బెలిదె వెంకన్నగుప్తా, మంతెన ఇంద్రారెడ్డి, ఏఓ చంద్రన్‌కుమార్, నాయకులు పద్మారెడ్డి, కుమారస్వామి, లింగారెడ్డి, కృష్ణంరాజు, ఉపేందర్, దయాకర్, స్పెషల్ ఆఫీసర్ అంతీరామ్, తహసీల్దార్ రవీందర్, ఏఓ వెంకటేశ్వర్లు, హౌజింగ్ డీఈ, పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్, దేవస్థాన చైర్మన్ మూర్తి, మార్కెట్ డైరెక్టర్లు మోహన్, శ్రీలతారెడ్డి పాల్గొన్నారు.

ముత్తయ్యకు ఉత్తమ అవార్డు



జనగామ : జనగామ ఆర్టీసీ డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం. ముత్తయ్యను ఆదివారం డిపో మేనేజర్ స్వాతి ఉత్తమ అవార్డును అందజేశారు. ఆర్టీసీలో అంకిత భావంతో పని చేస్తున్న ముత్తయ్యకు గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని అవార్డును అందించి అభినందించారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి



జనగామ రూరల్ : జనగామ పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ రోడ్డులో అండర్ పాస్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్షలను సీపీఎం నాయకుడు ఎండీ దస్తగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలన్నారు. సభ్యులు పందిల్ల బత్తుల అరుణ, సుగుణ, తాళ్లపల్లి సైదులు, శివరాత్రి హేమలత, బూడిది సులోచన, ప్రమీల, వసంత, నీలమ్మ, పద్మ, యాదమ్మ, రాధికతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలంలో గణతంత్ర వేడుకలు



పంట పొలంలో జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపిస్తున్న యువ రైతులు

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని బైరోనిబావి యువ రైతు సంఘం ఆధ్వర్యాన గణతంత్ర వేడుకలను తమ పంట పొలాల్లో నిర్వహించి దేశభక్తిని చాటుకున్నారు. జెండా కర్రకు వరి నారులో అలంకరించి జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఏదునూరి కార్తీక్, ఉపాధ్యక్షుడు సాగర్, ప్రధాన కార్యదర్శి కార్తీక్, కార్యదర్శి క్రాంతికుమార్, కోశాధికారి వినోద్‌తో పాటు గౌరవ అధ్యక్షులు కృష్ణ, వెంకటేశ్, ముఖ్యసలహాదారులు శ్రీశైలం, జగన్నాథం పాల్గొన్నారు.

గుడ్లు విసిరారు.. కుర్చీలు లేపారు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల మధ్య బాహా బాహీ
- జర్నలిస్టులు, గులాబీ శ్రేణులకు గాయాలు
- ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు
- 'పల్లా'ను బలవంతంగా తరలించిన పోలీసులు
- లాఠీచార్జికి దారి తీసిన ఘటన
- మంత్రి పొంగులేటి పర్యటన రద్దు
- ఎర్రగుంట తండాలో ఉద్రిక్తత.. మోహరించిన పోలీసు బలగాలు



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

జనగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాల ప్రారంభం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య గొడవకు దారితీసింది. కుర్చీలు విసిరేసుకుంటూ.. గుడ్ల దాడి చేయడంతో పలువురికి గాయాలు కాగా.. ఇరువర్గాలను పోలీసులు అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం జనగామ మండలం ఎర్రగుంటతండాలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు కావాల్సి ఉంది. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో నాలుగు పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రోగ్రాంకు హాజరై, ముందస్తుగా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో మాట్లాడారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ శ్రేణులు పల్లా జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు పోటా పోటీగా నినదించారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. దీంతో ధర్మసాగర్‌లో కార్యక్రమం ముగించుకుని జనగామకు బయల్దేరిన మంత్రి పొంగులేటి.. తన పర్యటన రద్దు చేసుకుని నేరుగా హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ విషయాన్ని అధికారులు వేదిక పై నుంచి ప్రకటించగా.. ఎమ్మెల్యే పల్లా అక్కడే ఉన్న మైక్‌లో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఆగ్రహించిన కాంగ్రెస్ శ్రేణులు పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేయడంతో మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇదే సమయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రగుంట తండాకు వస్తున్నారనే సమాచారం మేరకు డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఎమ్మెల్యే పల్లాను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో గులాబీ శ్రేణులు ఆయన చుట్టూ రక్షణగా నిలబడ్డారు. ఇరువర్గాల మధ్య నినాదాలు.. వాగ్వాదాల హోరులోనే ఒకరిపై నొకరు కుర్చీలు విసిరేసుకున్నారు.



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బలవంతంగా తీసుకెళుతున్న పోలీసులు

టెన్షన్ టెన్షన్

పోలీసులు రెండు వర్గాలను కంట్రోల్ చేసే సమయంలో.. కాంగ్రెస్ వైపు నుంచి కోడిగుడ్లు, రాళ్లను విసరడంతో ఎమ్మెల్యేకు తృటిలో ఆపాయం తప్పింది. పరిస్థితిని అర్థం చేసుకున్న పోలీసులు లాఠీచార్జీ చేసి చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఒకరినొకరు తోసుకురావడంతో ఖాకీల చేతిలో ఉన్న కర్రలు విరిగేంత వరకు లాఠీచార్జీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనలో గానుగుపహాడ్ మాజీ సర్పంచ్ కుమార్, వెంకిర్యాల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి అశోక్, యాకయ్య, పలువురు వార్డు సభ్యులు గాయపడ్డారు. జర్నలిస్టు కాసాని ఉపేందర్‌కు కంటితోపాటు శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తరలించగా, గాయపడ్డ జర్నలిస్టును ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డీసీపీ రంగంలోకి దిగి ఎమ్మెల్యే పల్లాను బలవంతంగా తన కారులో ఎక్కించి బందోబస్తు నడుమ జనగామకు తీసుకెళ్లారు. ఎర్రగుంట తండాలో ఉద్రిక్తత పరిస్థితులు పునరావృతం కాకుండా పెద్ద ఎత్తున పోలీసు బలగాలను దింపి, రబ్బర్ బెల్లుట్లను ప్రయోగం చేసే వాహనాన్ని సైతం అందుబాటులో ఉంచారు. ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎర్రగుంట తండాకు చేరుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. దాడిలో గాయపడ్డ జర్నలిస్టు ఉపేందర్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆస్పత్రిలో వేర్వేరుగా పరామర్శించారు.

ముందస్తు అరెస్టులు..

ఎర్రగుంట తండాలో మంత్రి ప్రోగ్రాం నేపథ్యంలో పోలీసులు బీఆర్ఎస్, బీజేపీ, బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. దీంతో ప్రధాన, ప్రతిపక్ష పార్టీలు పోలీసుల తీరును తప్పుబట్టాయి. ప్రజాస్వామ్యంలో మంత్రి పర్యటనకు వస్తే సమస్యలపై వినతి ఇచ్చే హక్కు కూడా లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.. డీసీపీ దృష్టికి తీసుకెళ్లి, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీ కావ్య

జఫర్‌గఢ్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తున్నదని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. మండలంలోని అల్వార్‌బండా తండా (శంకర్‌తండా)లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ కడియం కావ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇచ్చిన పాపానపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలతోపాటు ఇవ్వని హామీలను కూడా నేరవేర్చుతున్నట్లు తెలిపారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా.. ఏ పథకం అగిపోవద్దనే ఉద్దేశంతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్న గ్రామమైన అల్వార్‌బండాతండాలో నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో తన నిధుల ద్వారా తండా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు పథకాల మంజూరి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, మండల ప్రత్యేక అధికారి రాధకిషన్, సొసైటీ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, ఏఓ కరుణాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నూకల ఐలయ్యతోపాటు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, తండావాసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం తీగారం గ్రామంలో డీఆర్‌డీఓ వసంత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అధికారులు గ్రామంలో సమావేశంలో నిర్ణయించిన లబ్ధిదారులకు ఆహార భద్రత రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాలు మంజూరు పత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, ఎంపీడీఓ రాములు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ రవీందర్, తొర్రూరు మార్కెట్ చైర్మన్ తిరుపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఏపీఓ మంజుల, ఆర్‌ఐ రాకేశ్, నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, కుమార్, తీగారం మాజీ సర్పంచ్ పోగు రాజేశ్వరి శ్రీనివాస్, మొగుళ్ల, కుమారస్వామి, భాస్కర్, సలేంద్ర శ్రీనివాస్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం

కొడకండ్ల: ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇంటింటా సౌభాగ్యం చేకూరుతుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నీలిబండతండాలో 67 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 123 మందికి రేషన్‌కార్డులు, 19మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 1306 మందికి రైతుభరోసా మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాపాలనలో రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, తహసీల్దార్ చంద్రమోహన్, ఎంపీడీఓ నాగేశ్వాద్రి సూరి, ఏఓ విజయ్‌రెడ్డి, తొర్రూరు మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఎపీఓ కుమారస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిట్టపల్లి సురేందర్

- నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్

లింగాలఘణపురం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'వేల గొంతులు.. లక్ష డప్పుల దండోరా' సాంస్కృతిక మహాసభను జయప్రదం చేయాలని సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ కోరారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, రాష్ట్ర కళానేత సంజీవ ఆధ్వర్యంలో జరిగిన డప్పు చప్పులు, కోలాట ప్రదర్శనతో చైతన్య సమావేశం దండోరా కళామండలి అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనమని, అడ్డుకోవడం తగదని అన్నారు. 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్న మంద కృష్ణమాదిగ అభినందనీయుడని వర్ణించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి పటేల్, బాబు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కిషోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కళాకారులు నర్సయ్య, శ్రీనువాసు, రాజు, సందెన రవీందర్, బొట్ల మహేశ్, గండి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటుతాం..

రఘునాథపల్లి: వర్గీకరణ అమలు కోసం 'లక్ష డప్పులు– వెయ్యి గొంతుకల కార్యక్రమం'తో సత్తా చాటుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు జేరిపోతుల సుధాకర్‌మాదిగ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని ఇబ్రహీంపూర్‌లో ఎమ్మార్పీఎస్ యూత్ అధ్యక్షుడు గ్యార నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన డప్పు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రజుమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుంచు సురేందర్‌మాదిగ, తాళ్లపల్లి కుమార్, దర్శనాల రవి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పోకల శ్రీనివాస్, నాయకులు నరేష్, నర్సింగం, ఉపేందర్, రాజయ్య, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఓర్వలేకనే పంచాయితీ

- డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి



ఎర్రగుంటతండాలో మాట్లాడుతున్న కొమ్మూరి

జనగామ: ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్ల సుదీర్ఘ కాలం తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కళ్లలో ఆనందం చూసేందుకు సంక్షేమ పాలన చేస్తుంటే.. చూసి ఓర్వలేని బీఆర్ఎస్ పార్టీ పంచాయితీ చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం ఎర్రగుంట తండాలో ఆదివారం ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల నుంచి బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనాన్ని దోచుకోవడం తప్ప, అంతా శూన్యమన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌ను ఇంటికి పంపించి కాంగ్రెస్‌కు పట్టం కట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. అర్హులకు పథకాలు అందిస్తుంటే, స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కావాలని గొడవలను సృష్టిస్తున్నారన్నారు. తనకు పదవి లేకున్నా, ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో ప్రజల మధ్య ఉంటున్నామన్నారు. బీఆర్ఎస్ రౌడీయిజాన్ని చూస్తూ ఊరుకోమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కసీటు వచ్చే అవకాశం లేకపోవడంతో బీఆర్ఎస్ ఇలాంటి అడ్డంకులను సృష్టిస్తుందని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గ్రామానికి వస్తే, గ్రామంలోని సమస్యలను వివరించి, అభివృద్ధి కోసం రూ.100కోట్లు అడిగేందుకు సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే సభ ప్రారంభానికి ముందుగానే వచ్చి గొడవలు పెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్, వంగాల మల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డి, బొట్ల శ్రీనివాస్, మేడ శ్రీనివాస్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

నలిగిన వలస బతుకులు

ట్రైలర్ ట్రక్ రూపంలో నలుగురిని కబళించిన మృత్యువు

- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు..



ఘటనా స్థలంలో గుమిగూడిన జనం

సాక్షి, వరంగల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోష్ చౌహాన్ కుటుంబానిది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. కత్తులు, కొడవళ్లు, గొడ్డలి, పారలతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ జీవనాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఐదురోజుల క్రితం మామునూరుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన అతని అన్న కొడుకు సుమీర్ కుటుంబం డేరా వేసుకొని జీవనం వెళ్లదీస్తుండడంతో వారి పక్కనే మరో డేరా వేసుకొని పని చేసుకుంటున్నారు. రెండు కుటుంబాలు ఒక్క దగ్గరే ఉంటుండడంతో వచ్చిన గిరాకీ కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అక్కడికి వచ్చిన ఇతరుల ద్వారా లోహిత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే మామునూరు బెటాలియన్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు కూతవేటు దూరంలో 18 టైర్లతో కూడిన ట్రైలర్ ట్రక్ అతివేగంతో అదుపు తప్పి ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న భారీ ఇనుప రాడ్లు ఎగిరి కాస్త ముందు ఉన్నమరో ఆటోపై ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో నువురు సంతోష్ చౌహాన్(45), అతని కుమార్తెలు పూజ చౌహాన్(18), కిరణ్ చౌహాన్(18)లు అక్కడికక్కడే మరణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఖన్నా (8) చనిపోయాడు. ఇనుపరాడ్లు పడడంతో మృతదేహాలు గుర్తుపట్టరాకుండా ఛిద్రమయ్యాయి.

మూడు జేసీబీలతో ఇనుపరాడ్ల తొలగింపు

ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులకు అప్పటికే ట్రక్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్ జామైంది. దీనికితోడు ఇనుపరాడ్లు తీయడం సవాల్‌గా మారింది. సమీపంలోని మూడు జేసీబీలను తీసుకొచ్చారు. ఇటు ఆర్టీఓ జంక్షన్ వైపు హైవే రహదారిని మూసివేసి వాహనాలు రాకుండా చూశారు. ఆ జేసీబీల సహాయంతో ఇనుప రాడ్లలో చిక్కుకున్న ఐదుగురు క్షతగాత్రులను బయటకు తీసేందుకు అరగంటకు పైగా సమయం పట్టింది. డీఆర్ఎఫ్ బృందాలు కూడా పనిచేశాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌ల్లో వారిని ఎంజీఎం ఆసుపత్రికి పంపించారు. ఆ తర్వాత రహదారికి అడ్డుగా ఉన్న ట్రైలర్ ట్రక్కును జేసీబీల సహాయంతో ఎడమవైపునకు తోసేశారు. రహదారిపై పడి ఉన్న ఇనుపరాడ్లను కుడివైపున పడేశారు. ఆ తరువాత ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు గంటకుపైగా సమయం తీసుకుంది. ఘటనాస్థలిని వరంగల్ కలెక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు.

నిన్న వెళ్తే.. ఈ ఘోరం జరిగి ఉండేది కాదు...

మామునూరు ప్రధాన రహదారికి అనుకొని వీరు వేసుకున్న డేరా బోసిపోయింది. ఉదయం 11 గంటల వరకు సంతోషంగా ఉన్న ఆ ఫ్యామిలీ 20 నిమిషాల వ్యవధిలో ఘోర ప్రమాదం బారినపడడంతో అక్కడున్నవారు చర్చించుకోవడం కనిపించింది. 'ఐదు రోజుల పాటు అక్కడే ఆడుతూ పాడుతూ గడిపిన సంతోష్ కుటుంబం శనివారం సాయంత్రమే లోహితకు వెళ్లాల్సి ఉండే. బొల్లికుంట మీదుగా వెళితే త్వరగా వెళ్లొచ్చని చెప్పాం. తెలిసిన వారు గవిచర్ల క్రాస్ నుంచి రమ్మని చెబుతున్నారనడంతో ఆటోను రూ.1,000లకు కిరాయి అడిగితే ఏమీ లేనివారని రూ.500లకు మాట్లాడించి పంపించాం. నిమిషాల వ్యవధిలోనే ఆ కుటుంబం రోడ్డు ప్రమాదం బారినపడడంతో మాకు కన్నీళ్లు ఆగడం లేదు' అని అక్కడే టైలర్ దుకాణంలో పనిచేసే ఓ వ్యక్తి వాపోయాడు.


రూ.200 డీజిల్ కొట్టించుకున్నారు...



ఆరుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో మా పెట్రోల్ బంక్‌లో రూ.200 డీజిల్ పోయించుకున్నారు. ఫోన్ పే పనిచేయకపోవడంతో కాసేపు ఆగారు. చివరకు డబ్బులిచ్చి హైవేపైకి వెళ్లారు. నిమిషాల వ్యవధిలోనే ట్రైలర్ ట్రక్కు అతివేగంతో వచ్చి చేసిన ప్రమాదంతో వీరి ఆటో నుజ్జునుజ్జయింది. మేం పోయేసరికే ఆ ఇనుప రాడ్లు పడి అందులో చిక్కుకున్న వారి ఆర్తనాదాలు మాకు వినిపించాయి. ఆ ఇనుపరాడ్లు తీద్దామంటే బాగా బరువు ఉండడంతో తీయలేకపోయాం.

– జాకీర్, పెట్రోల్‌బంక్ సిబ్బంది

గంట ముందు మాట్లాడాను..



గంట ముందు వరకు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఇక్కడికి కొద్ది మీటర్ల దూరంలో ఉన్న లోహిత గ్రామానికి వెళుతున్నామని, వచ్చే ఆదివారం కలుసుకుందామని చెప్పారు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.

– సుమీర్, సంతోష్ అన్న కుమారుడు

నలుగురిని బలిగొన్న మద్యం మత్తు..

మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ రాజస్థాన్ వాసి యోగిందర్ సింగ్ తీవ్ర మద్యం మత్తులో ఉన్నాడు. అతనికి పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయగా 280 ఎంజీ/100 మిలీ రీడింగ్ నమోదైంది. ఇతడి వల్ల నలుగురి ప్రాణాలు పోయాయి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు అతి వేగం, డ్రంకెన్ డ్రైవ్ వల్లనే జరుగుతున్నాయని, తమకు ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల ప్రాణాలు తీస్తున్నారని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ అన్నారు. ఇటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే



మెరుగైన వైద్యం అందించండి

- క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద



ఘటనా స్థలం వద్ద వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఎంజీఎం: మామునూరు వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద ఎంజీఎం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనను పరిశీలించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కాగా, స్వల్ప గాయాలపాలైన ఆటో డ్రైవర్ షకీల్‌ను వైద్య చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోస్టుమార్టం పూర్తి చేసిన మృతదేహాలను, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో ఎంజీఎం పరిపాలనాధికారులతోపాటు వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులు దగ్గరుండి ప్రత్యేక అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి పంపించారు.

మంత్రి సురేఖ పరామర్శ..

ఆస్పత్రిలోని క్షతగాత్రులను సాయంత్రం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.